కాకినాడలో ఈనెల 5 నుంచి నాలుగు రోజులు పాటు జరుగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు శ్రీకాకుళం జిల్లా నుంచి యుటిఎఫ్ పతాకం తీసుకెళుతున్న నాయకులకు కోట జంక్షన్ వద్ద స్వాగతం పలుకుతున్న యుటిఎఫ్ విజయనగరం నాయకులు.
- ప్రజాశక్తి, విజయనగరంటౌన్

ఇఎస్ఐ ఆస్పత్రిలో ఇష్టారాజ్యం

యాజమాన్యం తీరుతో తగ్గిపోయిన ఓపి

ఖాళీగా ఆరు పోస్టులు..

ఉన్న పదిమందిలోనూ ఇద్దరు డిప్యుటేషన్

కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ

ఇఎస్ఐసి (ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) ఇష్టారాజ్యం, స్థానిక వైద్యుల బాధ్యతా రాహిత్యం కారణంగా విజయనగరం ఇఎస్ఐ ఆసుపత్రిని పుట్టెడు సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో రోగుల సమస్యలు వర్ణణాతీతంగా మారాయి. సగానికి సగం వైద్య పోస్టులు ఖాళీగా ఉండడం, ఉన్న అరకొరమంది కూడా స్థానికంగా ఉండకపోవడం, మందుల కొరత, వైద్యపరీక్షలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఓపి ఘననీయంగా తగ్గిపోయింది. దీనికితోడు ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టుగా మారింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోవున్న ఆసుపత్రి ఒకప్పుడు వైద్యులు తక్కువ మంది ఉన్నా మెరుగైన వైద్యసేవలు, అన్ని రకాల మందులు, వైద్యపరీక్షలు అందుబాటులో ఉండడంతో నిత్యం రోగులతో కిటకిటలాడేది. ఉమ్మడి జిల్లాలో సుమారు 60వేల మంది కార్మిక కుటుంబాలవారు ఈ ఆస్పత్రిపై ఆధారపడుతున్నారు. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఆసుపత్రిపై క్రమంగా రోగులకు నమ్మకం సన్నగిల్లడమే ఇందుకు కారణం. అయినా ఇదేమీ ఉత్తి ధర్మానికి పెట్టిన ఆసుపత్రి కాదు. కార్మికులు చెమటలు చిందించగా వచ్చిన ప్రతిఫలంలో కొంత భాగం నెలనెలా ఇఎస్ఐసికి చెల్లిస్తారు. ఇలా సమకూరిన మొత్తం నుంచే ఆసుపత్రి నిర్వహణ, మందులు, వైద్యులు, సిబ్బంది జీత భత్యాలు, ఇతర అవసరాలకు ఖర్చుచేస్తారు. వైద్యులు, సిబ్బంది వేతనాలు ప్రభుత్వం నెలనెలా చెల్లిస్తున్నప్పటికీ, కార్డుదారులకు అందుకు వైద్యసదుపాయాలు లేవు. వాస్తవానికి ఈ ఆసుపత్రిలో 16పోస్టులు ఉన్నాయి. ఇందులో ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న పది పోస్టుల్లో ఇఎన్‌టి, రేడియాలజీ నిపుణులు విశాఖలోని మల్కాపురం రీజనల్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఇక్కడ వేతనం. అక్కడ ఉద్యోగం అన్నమాట. వీరికి ఇఎస్ఐసి డైరెక్టరేట్ కార్యాలయం ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయట. ఈనేపథ్యంలో కనీసం కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చినవారికి స్కానింగ్ చేసేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. ఇక దంత వైద్యం కోసం జనాలు రావడమే మానుకున్నారు. ఆప్తమాలజీ సహా ఆరు పోస్టులు ఉన్నప్పటికీ భర్తీకి ఇఎస్ఐసి మీనమేషాలు లెక్కస్తోంది. మిగిలిన ఎనిమిది మందిలో ఒకరిద్దరు మినహా మిగిలినవారంతా విశాఖ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వచ్చేటప్పుడు గంట, అరగంట అలస్యం సహజంగానే జరుగుతోంది. భోజన విరామంలో ఎంతకష్టమైనా ఆరగించేవరకు వేచి వుండాల్సిందే. మధ్యాహ్నం 3 గంటల వరకు సేవలందించాల్సివుంది. కానీ, సుదూర ప్రాంతాల నుంచి 2గంటలకు వచ్చినవారిపైనా ఇంత ఆలస్యమా? ఉదయమంతా ఏం చేశారు? అంటూ వైద్యులు కసురుకుంటున్నారు. ఇక ఆ తరువాత వస్తే 'డాక్టర్‌గారు ఇప్పుడే బయటకు వెళ్లారు. టైం కూడా అయిపోయింది కదా? అటు నుంచి అటు వెళ్లిపోతారేమో'? అంటూ అక్కడి సిబ్బంది

వైద్యులు రాక..రోగులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కవరింగ్ ఉంటుంది. దీంతో, ఆస్పత్రికి రోగుల తాకిడి తగ్గిపోతోంది. ఒకప్పుడు రోజు వందమంది రోగులు వచ్చే ఈ ఆసుపత్రిలో నేడు 20 నుంచి 30మందికి పరిమితమైంది.

సెకండ్ కేర్ రిఫర్ రద్దుతో ప్రాణాలకు ముప్పు

అసలే వైద్యులు సరిపడినంత మంది లేరు. ఆపై ఉన్నవారిలో ఇద్దరు విశాఖ నుంచి సేవలందిస్తున్నారు. మందులు, వైద్యపరీక్షలు అందుబాటులో ఉండడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో సెకండ్ కేర్ రిఫర్ కూడా ఇఎస్ఐ యాజమాన్యం రద్దుచేసింది. గతంలో సెకండ్ కేర్ పవర్ స్థానిక వైద్యులకు ఉండడం వల్లే వారి వల్ల కాని వైద్యం కోసం నగరంలోని ఇఎస్ఐ నెట్ వర్కు ఉన్న ఆసుపత్రులకు పంపేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో, మల్కాపురం వెళ్లేలోపు ప్రాణాలు పోయినా అంతే సంగతులు. దీంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో రూ.లక్షలు ఖర్చుచేసి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఇఎస్ఐలో ఎక్స్‌రే తీయించాలన్నా విశాఖలోని మల్కాపురం ఆసుపత్రికి వెళ్లి తీరాల్సిందే.

అధునాతన భవనం ఉన్నా అద్దె కొంపలోనే లోకల్ ఆఫీస్

ఇఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలోనే అధునాతన భవనం ఉన్నప్పటికీ దీనికి అనుబంధంగా ఉండాల్సిన లోక్ ఆఫీస్ అద్దె కొంపలో నడుస్తోంది. ఆర్థిక లావాదేవీల్లో చిలక్కొట్టుడు వ్యవహారాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇఎస్ఐ కార్డుదారుల సెలవుల నమోదు, సెలవు కాలంలో కార్పొరేషన్ తరపున ఇవాల్సిన లావాదేవీలు ఇక్కడి నుంచే జరుగుతాయి. ఈనేపథ్యంలో విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోవున్న ఆసుపత్రిలో సెలవు తీసుకుని, ఆయా పత్రాలను రింగురోడ్డులోని లోక్ ఆఫీస్‌కు వెళ్లాలంటే రెండు ఆటోలు మారాల్సివుంటుంది. ఈనేపథ్యంలో సెలవు తీసుకోవాల్సిన పరిస్థితుల్లో వున్న పేషెంట్లు తిరగడమే కష్టం. దీనికితోడు ఆటో ఛార్జీలు, సమయం వృథా అదనపు కష్టాలుగా చెప్పుకోవచ్చు. ఆసుపత్రి ఆవరణంలో ఉన్న క్లాస్-3 క్వార్టర్స్‌లో లోకల్ ఆఫీస్ నడపాలంటూ ఉన్నతాధికారుల నుంచి మొక్కబడి ఆదేశాలే తప్ప ఎందుకు నిలదీయడం లేదో అర్థం కాని పరిస్థితి ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

కొన్ని మందులు లేకపోవడం వాస్తవమే

ఇఎస్ఐ ఆస్పత్రిలో కొన్ని మందులు లేకపోవడం వాస్తవమేనని ఆస్పత్రి డయోగ్నోస్టిక్ సెంటర్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, సివిల్‌సర్జన్ డి.కృష్ణకిశోర్ తెలిపారు. శనివారం ప్రజాశక్తి దినపత్రిక లో 'ఉద్యోగుల రాష్ట్ర భీమా... మందులు లేవమ్మా' అనే శీర్షికను ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. విజయనగరం ఇఎస్ఐ ఆస్పత్రికి విశాఖలోని ఇఎస్ఐ ఆస్పత్రిలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మాత్రమే సరఫరా అవుతాయని, ఇక్కడ ఇనుంచి జిల్లాలోని డిస్పెన్సరీలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. కేవలం కొన్ని రకాల మందులు మాత్రమే లేవని, అయితే వాటిని కుడా గత వారం నుంచి ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చే ఏర్పాట్లు చేసామని తెలిపారు. చిన్న పిల్లల జ్వరాలకు సంబంధించిన సిరప్ లు, మందులు డయాగ్నొస్టిక్ సెంటర్ లోని ఫార్మసీలో పూర్తి స్థాయిలో అందుబాటులో వున్నాయని తెలిపారు. కొన్ని రకాల ల్యాబ్ టెస్ట్ లు తమ వద్ద వున్న లాబొరేటరీలోనే అందుబాటులో వున్న పరికరాలతో చేస్తున్నామని వివరించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందుల స్టాక్ వారం రోజుల్లో వస్తుందని తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన రేడియోగ్రాఫర్ తన విధులకు రాజీనామా చేసారని, ఆయన స్థానంలో వేరొకరిని నియమించేందుకు ప్రక్రియ చేపట్టామని తెలిపారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్రమంత్రి శ్రీనివాస్, మాజీ మంత్రి అరుణ, మాజీ ఎంపిపి శ్రీదేవి

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ కళాశాలు

- విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్ విద్యే కీలకం
- మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇంటర్ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచే లక్ష్యంతో ఇంటర్ పాఠ్యాంశాల్లో మార్పులు వంటి చర్యలకు రాష్ట ప్రభుత్వం నాది పలికిందని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు భోజనాన్ని వడ్డించడంతో పాటు వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఇంటర్ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే వారి భవిష్యత్తు నిర్ణయమవుతుందని పేర్కొన్నారు. అందువల్ల విద్యార్థులంతా తమ సమయాన్ని సద్వినియోగం చేసుకొంటూ ఉన్నత స్థాయికి ఎదిగే ప్రయత్నం చేయాలన్నారు.బోధనలో వున్నలోపాలను సరిదిద్దుకొని కళాశాలలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కళాశాల అభివద్ధికి అవసరమైన నిధులను సమీకరించి కంప్యూటర్ ల్యాబ్, ఇతర వసతులను కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వద్దు బ్రో అనే అంశంపై మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, మాజీ ఎంపిపిలు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, నాయకులు పివివి గోపాలరాజు, కళాశాల ప్రిన్సిపాల్ పిఎల్ఎన్ ప్రకాశరావు పట్నాయిక్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరాలి : కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం టౌన్ : ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, అందుబాటులో ఉన్న అవకాశాలను సోపానాలుగా చేసుకొని ఉన్నత స్థానానికి చేరాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. విజయనగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 4,660 మంది విద్యార్థులకు ఈ పథకం వల్ల ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ పథకాన్ని విద్యార్థులంతా పూర్తిగా వినియోగించుకొని చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పాలవలస యశస్వి, ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ, డిఇఒ యు.మాణిక్యం నాయుడు, ఎడి గోపీకృష్ణ, ఎంఇఒలు పివిపిఆర్‌సిహెచ్ రాజు, కె.సత్యవతి, కళాశాల ప్రిన్సిపాల్ వికెవి కృష్ణారావు, కూటమి పార్టీల నాయకులు ఐవిపి రాజు, పిళ్లా విజయకుమార్, శివప్రసాద్‌రెడ్డి, పి.ప్రసాద్, కంది చంద్రశేఖర్, ఇ.సుధీర్, అనురాధ, మజ్జి రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమానికి శతశాతం రుణాలివ్వాలి

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంక్షేమ శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు బ్యాంకర్లు శతశాతం రుణాలను మంజూరు చేసి, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. జిల్లా స్థాయి డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశం కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. బ్యాంకుల సహకారంతో అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు, లక్ష్యాల సాధనపై కలెక్టర్ సమీక్షించారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెట్ 2047 లో భాగంగా జిల్లాలో ప్రాధమిక రంగంలో ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం క్రింద రబీలో కూడా సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో సుమారు 2 లక్షల ఎకరాలు సాగవుతుండగా, రబీలో కేవలం 60వేల ఎకరాలు మాత్రమే సాగు అవుతోందని చెప్పారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు అవసరమైన వనరులను కల్పించడంతోపాటు, బ్యాంకులనుంచి పంట రుణాలను మంజూరు రైతులకు తోడ్పాటు నందించాలని కోరారు. రబీలో సాగు విస్తీర్ణం ఏటా కనీసం 15 శాతం పెంచి రైతుకు లబ్ది చేకూర్చడమే తమ లక్ష్యమని చెప్పారు. స్టార్టప్ ఇండియా కార్యక్రమం కింద మంజూరు చేస్తున్నసబ్సిడీ లేని రుణాలపట్ల లబ్దిదారులను చైతన్యపరచాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన పరిశ్రమలశాఖ, కెవిఐసి అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, వారిపై చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. నాబార్డ్ సహకారంతో బాడంగి మండలం రైతుల జట్టు పిపిసికి, డిసిసిబి, ఆప్కాబ్ నుంచి బెల్లంపొడి తయారీ యూనిట్ స్థాపనకు మంజూరు చేసిన రూ.కోటి,40లక్షల రుణానికి సంబంధించిన చెక్కును ఈ సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా అందజేశారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, మెప్మా పిడి సత్తిరాజు, జెడిఎ విటి రామారావు, ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, ఎల్‌డిఎం మూర్తి, నాబార్డ్ డిడిఎం నాగార్జున, అధికారులు, బ్యాంకర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాల్టీ కార్మికుల ర్యాలీ.. మానవహారం

- వేతన ఒప్పందం చేసే వరకు పోరాటం ఆగదు : సిఐటియు నాయకులు
- కార్మికుల ఆందోళనకు మాజీ ఎంపి బెల్లాన మద్దతు

కార్మికుల ర్యాలీలో పాల్గొన్న సిఐటియు నాయకులు, మాజీ ఎంపి బెల్లాన

ప్రజాశక్తి-చీపురుపల్లి

వేతన ఒప్పందం చేసి, నూతన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కర్లాంలో వెంకట్రామా పౌల్ట్రీ కార్మికులు శనివారం సిఐటియు ఆధ్వర్యాన పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. నూతన వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈనేపథ్యంలో యాజమాన్యంతో అధికారుల సమక్షంలో జరిగిన చర్చలు విఫలమవ్వడంతో కార్మికులు స్థానిక తహశీల్దారు కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేసారు. మానవ హారం చేసేందుకు పోలీసులు అనుమతి లేదని చెప్పడంతో కొంతసేపు కార్మికులు, పోలీసుల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో వైసిపి మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ కార్మికులకు అండగా మద్దతును ప్రకటించి ర్యాలీ, మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టివి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడారు. గత ఏడాది మే నెలతో పాత వేతన ఒప్పందం పూర్తి కావడంతో జూన్ నుండి కార్మికులకు చేయాల్సిన నూతన ఒప్పందాన్ని అమలు చేయాలని కార్మికులు కోరుతుంటూ యాజమాన్యం మీనమేషాలు వేస్తోందని అన్నారు. 9 రోజులుగా సమ్మె చేస్తుంటే చర్చలు రావాలని పిలుస్తూనే తమని ఎటూ తేల్చకుండా వెనక్కి పంపించడం భావ్యం కాదని అన్నారు. వేతనంతో పాటుగా స్థానికులకు 70శాతం మందికి పౌల్ట్రీలో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 7న మరొకసారి చర్చలు ఉన్నాయని, అవి సఫలం కాకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. పోలీసులకు, కార్మికులకు మధ్య చిచ్చుపెట్టి యాజమాన్యం సినిమా చూద్దామను కుంటోందని, అలాంటివేమీ కుదరవని, అలాంటి భ్రమల్లో యాజమాన్యం ఉండొద్దని సూచించారు. సుమారు అరగంట పాటు మానవహారం చేయడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో సిఐటియు స్థానిక నాయకులు ఇప్పిలి గురునాయుడు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మానవహారం చేస్తున్న కార్మికులు

కార్మికులకు అండగా ఉంటాం

మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్

పౌల్ట్రీలో పని చేస్తున్న కార్మికులకు అండగా తాము ఉంటామని వైసిపి నాయకులు, మాజీ ఎంపి చంద్రశేఖర్ అన్నారు. మూడు రోడ్ల కూడలిలో జరిగిన మానవహారంతో పాటు ర్యాలీలో ఆయన తన అనుచరులతో కలసి పాల్గొన్నారు. కార్మికులు అహర్నిశలూ కష్టపడి కోళ్ల ఫారం నుండి వచ్చిన దుర్వాశనను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తుంటే యాజమాన్యం నూతన వేతన ఒప్పందం చేయక పోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. దేశంలో ఉన్న అన్ని పౌల్ట్రీల కంటే కర్లాం వద ఉన్న వెంకట్రామా పౌల్ట్రీకి మంచి లాభాలను కార్మికులు కష్టపడి తీసుకు వస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో పౌల్ట్రీ పెట్టి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రాల వారికి ఉపాధి కల్పించడం ఎంతవరకు సమంజసం అని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. బెల్లాన వెంట వైసిపి నాయకులు మహేష్, గెరిడి రామదాసు, బి తిరుపతి, కె ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి క్రెడాయి ప్రాపర్టీ షో

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలోని రింగ్‌రోడ్డులో గల లీ పేరడైజ్ కన్వెన్షన్‌లో ఈనెల 5, 6, 7తేదీల్లో క్రెడాయ్ ఆధ్వర్యంలో విజయనగరం చాప్టర్ 5 ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామని క్రెడాయ్ ప్రతినిధులు తెలిపారు. గృహ నిర్మాణానికి స్థలాలు కావలసినవారు, నిర్మాణాలు చేయదలచిన వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. క్రెడాయ్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థలాలు, గహ నిర్మాణ రంగానికి సంబంధించి ఫ్రాంటియర్ ఇంటీరియర్ డెకరేషన్స్, లిఫ్ట్స్, ఆటోమొబైల్స్, జనరేటర్స్, డూప్లెక్స్, విల్లాస్, లేఅవుట్ ప్లాట్స్, విఎంఆర్‌డిఎ ప్లాట్స్, వాటర్ ప్యూరిఫై, సోలార్ ఎనర్జీ లకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశామన్నారు. సందర్శకులకు లక్కీ డ్రాప్ ద్వారా బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో క్రెడాయ్ ఎపి వైస్ ప్రెసిడెంట్ కె.సుభాష్ చంద్రబోస్, క్రెడాయ్ విజయనగరం చైర్మన్ వి పార్థసారథి, ప్రెసిడెంట్ సిహెచ్ సూర్యనారాయణ రాజు, సెక్రటరీ కిలాని రాజశేఖర్, ట్రెజరర్ జిబి అనిల్ కుమార్, మాజీ చైర్మన్ చెరుకూరి శ్రీధర్ పాల్గొన్నారు

సిటియులో వర్క్‌షాప్

విజయనగరం టౌన్ : సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యాన 'ఫార్మా ఎసెన్షియల్స్'పై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించింది. ఔషధ పరిశ్రమలో అవకాశాలను విద్యార్థులకు వివరించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టివి కట్టిమణి, గౌరవ అతిథులుగా ఈశాయి ఫార్మాస్యూటికల్స్ డిప్యూటీ హెడ్ డాక్టర్ అనిల్ ఎస్ ఖిలే, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.వి. రమణ లు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

బ్రెయిలీ లిపిని కనుగొనడం ద్వారా అంధుల జీవితాల్లో లూయిస్ బ్రెయిలీ వెలుగులు నింపారని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనియాడారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిఆర్‌డి సమావేశ మందిరంలో శనివారం జరిగిన లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అంధులు కూడా చదువుకొని ఉన్నత స్థానాలను సాధించేందుకు ఈ లిపి ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు. ఈ లిపి ద్వారానే చాలామంది ఉన్నత ఉద్యోగులుగా, అధ్యాపకులుగా, సివిల్ సర్వీసెస్ ఉద్యోగులుగా కూడా ఎంపికయ్యారని చెప్పారు. అంధులకు ఉపయోగపడే విధంగా, వారి అవసరాన్ని బట్టి ప్రత్యేక కంప్యూటర్ శిక్షణా కార్యక్రమానికి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్రెయిలీ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఇన్చార్జి ఎడి, సిపిఒ పి.బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్ధననాయుడు, ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి, బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ రాంబాబు, అసోసియేషన్ నాయకులు ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఒడదాటాక బోడిమల్లన్న



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒడ్డుదాటే వరకు ఓడ మల్లన్నా అంటూ బతిమాలాడి... తీరా ఒడ్డుకు చేరాక బోడి మల్లన్న అన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ అమలుపై అచ్చంగా ఇదే సామెతను గుర్తు చేస్తోందని అంటున్నారు ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజానీకం. ఇందుకు కారణం లేకపోలేదు సుమా..! నిన్నగాక మొన్న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపట్ల ఆద్యంతం విస్తుపోతున్నారు. గడిచిన ఎన్నికల్లో మునుపటి ప్రభుత్వాన్ని మట్టికరిపించి మరీ టిడిపి, జనసేన పార్టీలకు అధికారం కట్టబెట్టారు. ఇందుకు రెండు కారణాలు. జగన్ ప్రభుత్వం అవలంభించిన అణిచివేత చర్యలు, విధానపరమైన అంశాలు, అమలు కానికొన్ని హామీలు. గత ఎన్నికల్లో సిఎం చంద్రబాబు ప్రధానంగా అధిక ధరలు, పన్నుల భారాలు, విద్యుత్ ఛార్జీలను బాదుడే బాదుడు అంటూ వ్యంగ్యాస్త్రాలతో విమర్శలు గుప్పించారు. దీనికితోడు అమ్మఒడి పథకం ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ వర్తింపజేస్తామని చెప్పారు. రైతులకు జగన్ ఇస్తున్న రూ.15వేల రైతు భరోసా పథకాన్ని పెట్టుబడి సాయం పేరిట రూ.20వేలకు, మత్స్యకారులకు చెల్లించే జీవన భృతిని రూ.20వేలకు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం ఇలా ఒకటేమిటి? ఎన్నికల్లో అప్పటి జగన్ ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో కన్నా ఎక్కువ ఆర్థిక సాయాన్ని అందిస్తామని, అందుకోసం గెలిపించాలని కోరి ఓట్లను ఆర్జించారు. ఉద్యోగాలకోసం డిఎస్సీ, ఉపాధి కల్పన కోసం పరిశ్రమల స్థాపన వంటి చర్యలు తీసుకోనున్నట్టు జనాన్ని ఆశల పల్లకిలోకి దింపారు. ఆ మాటలు కోటలు దాటినా ఆచరణ గడప దాటడం లేదు. దీంతో, బాబు ప్రభుత్వం గెలిచిన తరువాత మాట మార్చారని జనంలో చర్చనడుస్తోంది. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటున్న చంద్రబాబుకు, ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు సహా పరివారానికి ఎన్నికల ముందు ఈ పరిస్థితులు తెలియవా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా లక్షల మంది ఎదురు చూస్తున్న తల్లికి వందన పథకం ఆచూకీ లేదు. పైగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేయడానికి నిర్ణయం జరిగిందన్న విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ డబ్బులు వస్తాయన్న ఆశతో అప్పుచేసి ఫీజులు కట్టామని కొందరు, ఆ పథకాన్ని ఆశగా చూపించి యాజమాన్యాలను ఇన్నాళ్లూ ఒప్పించామని, ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదని ఇంకొందరు చర్చించుకుంటున్నారు. ఇక మెగా డిఎస్‌సి వచ్చే అకడమిక్ ఇయర్‌లో తీయాలని నిర్ణయం చేయడంతో మరో ఏడాది ముందుకు వెళ్లిపోయినట్టే. ఇప్పటికే ఐదేళ్లగా డిఎస్‌సి, టెట్ పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నామని, ఇటువంటి పరిస్థితుల్లో మరో ఏడాది పొడిగించడం అంటే అదును తీరిపోయాక నిరుద్యోగులను మోసం చేసినట్టేనని చర్చ నడుస్తోంది. ఇక ఇదిగో అదుగో అంటున్న మహిళలకు ఉచిత ఆర్టీసి ప్రయాణం కూడా ప్రహసనంగానే మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు, అంతకుముందు ఏర్పడిన వర్షాభావానికి రైతులు పెట్టుబడి పెరిగిపోయింది. రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం మాత్రం గడప దాటలేదు. దీంతో, రైతులు ప్రభుత్వ తీరుపై ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక గడిచిన ఐదేళ్లలో జ్యూట్, ఫెర్రో ఎల్లాయీస్, చెక్కెర పరిశ్రమల మూత వల్ల ఉద్యోగ, ఉపాధి కోల్పోయిన వారు ప్రభుత్వం మారితే తిరిగి బతుకుతెరువు దొరకుతుందను కున్నారు. ధరలు అదుపు చేయలేదని, పైగా జగన్ విద్యుత్ ఛార్జీలు పెంచడాన్ని బాదుడే బాదుడు అన్న టిడిపి తాజాగా రెండు దఫాలు పెంచిందని, బాబు వచ్చాక తగ్గించలేదు సరికదా నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోయాయని పబ్లిక్ టాక్ నడుస్తోంది. అధికార మార్పిడి తప్ప, ఈ విషయాల్లో టిడిపి, వైసిపి ప్రభుత్వాల మధ్య పెద్దగా తేడాలేదన్న వాదన మొదలైంది.

ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

మతసామరస్యానికై సిపిఎం ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశంలో మత సామరస్యాన్ని, దేశ సమగ్రతను కాపాడేందుకు ఇంటింటి ప్రచారం చేపట్టినట్లు సిపిఎం జిలా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు తెలిపారు. శనివారం దాసన్నపేట, నవాబ్‌పేట, కనపాకలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక అయిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అవమానించడం, మసీదులపై దాడులు, దేవాలయాలు కబ్జాకు ప్రయత్నిస్తున్న కేంద్ర ఎన్‌టిఎ కూటమి ప్రయత్నాలను త్రిప్పి కొట్టేందుకు రాజ్యాంగాన్ని పరిరక్షించు కోవడం ఒక్కటే మార్గమని అన్నారు. లౌకిక శక్తులన్నీ ఈ కృషిలో భాగం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, సూరిబాబు,రవి,గోపి, తది తరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న బాబూరావు

అలుగోలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎంసి ఛైర్మన్ ఆల్లి బాబూరావు కోరారు. శనివారం ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థుల అవస్థలను గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం సమయంలో షెడ్ లేక ఆరుబయట కూర్చుని భోజనం చేసే దుస్థితి ఏర్పడిందన్నారు. తరగతి గదులు లేక బయటనే చెట్లు కింద కూర్చొని చదువుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని దీనివల్ల ఎండ తాకిడికి విద్యార్థులు ముఖం చెమట్లతో కళ్ళు తిరిగి పడిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖామంత్రి లోకేష్ స్పందించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రెండు గ్రామాల్లో సభలు నిర్వహణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం, సోంపురం గ్రామాలలో శనివారం ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి చెందడానికి అవసరమైన సదుపాయాలు గూర్చి పంచాయతీ పాలకవర్గాల సభ్యులు చర్చించారు. ప్రభుత్వ స్థలాల్లోనూ, గ్రామపంచాయతీ సంబంధించిన స్థలాల్లోనూ ఏ విధమైన భవనాలు నిర్మించినా పంచాయతీ ఆమోదం మేరకు జరగాలని సమావేశంలో తీర్మానించారు. అంగన్‌వాడి భవనాలు అద్దెకొంపలో ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వ స్థలంలో కొత్త భవనాలను నిర్మించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రామసత్యవతి, ఎంపిటిసి పిల్లా లక్ష్మి, బొద్దాం సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి ఆకుల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు కాకర భారతి, శ్రీనివాస రావు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు వై సన్యాసిరావు, జనపరెడ్డి ఈశ్వర్ రావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ముకుంద రాజపురం, కృష్ణరాయుడుపేట గ్రామాల్లో శనివారం భూ రీసర్వేపై రైతులకు ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ గంగాధర్, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సర్వేయర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా భాగంగా పాఠశాల ఆవరణ, వంటగది, టాయిలెట్స్, పరిశీలన చేశారు. అనంతరం విద్యార్థుల చేత తెలుగు అభినయ గేయాలు, వర్ణమాల, పదాలు చదివించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

9న జిల్లా పరిషత్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ సమావేశాలను ఈనెల 9వ తేదీ ఉదయం 11గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు జెడ్‌పి సిఇఒ బి.వి.సత్యనారాయణ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని తెలిపారు.

బడ్జెట్ వందశాతం ఖర్చు కావాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కేటాయించిన వేతనాల బడ్జెట్ వందశాతం ఖర్చు చేయాల్సిందేనని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎపిఒలను ఆదేశించారు. వేతనాల రూపంలో ఖర్చుచేయాల్సిన బడ్జెట్ పూర్తిగా ఖర్చుచేయని పక్షంలో జిల్లా నష్టపోతుందని, జిల్లాకు మెటీరియల్స్ కాంపొనెంట్ కింద రావలసిన నిధులు తగ్గిపోతాయన్నారు. ఉపాధిహామీ పనులు, పల్లెపండుగ పనుల ప్రగతిపై కలెక్టర్ శనివారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో పంచాయతీరాజ్, ఉపాధిహామీ అధికారులతో సమీక్షించారు. వందరోజుల పని పూర్తిచేసిన కుటుంబాల సంఖ్య కూడా పెరగాల్సి వుందన్నారు. పల్లెపండగ పనులకు సంబంధించి బిల్లులు జాప్యం లేకుండా వెనువెంటనే అప్‌లోడ్ చేసి చేసిన పనులకు ఖర్చు చూపించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్.ఇ. శ్రీనివాసరావు, డ్వామా పీడీ శారదాదేవి, పంచాయతీరాజ్ డిఇ., ఎఇలు, ఎపిఒలు పాల్గొన్నారు.

ఎపిఒగా భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి భోగాపురం

ఉపాధి హామీ పథకం ఎపిఒగా భాగ్యలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. చీపురుపల్లి మండలం నుంచి బదిలీపై ఈమె ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఆదిబాబుకు ఇటీవలి చీపురుపల్లి బదిలీ అయిన విషయం తెలిసిందే.

సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు గాయత్రి

ప్రజాశక్తి - భోగాపురం

చెన్నై సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు మండలంలోని బసవపాలెం అవంతి కళాశాలకు చెందిన జి గాయత్రి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.గోవిందరావు తెలిపారు. ఇటీవల విజయనగరం జెఎన్‌టియులో ఉత్తరాంధ్రంలోని సుమారు 30 ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు వాలీబాల్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో గాయత్రి ప్రతిభ చూపడంతో సౌత్ జోన్‌లో జరిగే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అవంతి విద్యాసంస్థల ప్రతినిధి ముత్తం శెట్టి మహేష్, పరిపాలన అధికారి జి.అశోక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె భాస్కరరావు, హెచ్ఒడి మధు బిందు, పీడీ ఎం.నరేష్ తదితరులు అభినందించారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - వంగర

షాపులు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరావు అన్నారు. మండలంలోని అరసాడలో వివిధ షాపులు యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపులు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, ఎలా జరిగిందే అనే సమాచారం తెలుసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని పరిశీలించిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ కె.అప్పలరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వైద్య సేవలు, రోగుల స్థితి గతులు అడిగి తెలుసుకున్నారు. జరజాపుపేట నుంచి ఎక్కువ రోగులు రావడంపై వైద్యులను కారణం అడిగి తెలుసుకున్నారు. నగర పంచాయతీలోని పలు ప్రాంతాల్లో నీటి కలుషితం అవుతుందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో జనసేన నాయకులు బంగారు భాను ప్రకాష్, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానికులను విచారిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

చింతాడ విఆర్ఒ అడపా గౌరీశంకర్ పై పారాది గ్రామానికి చెందిన దళిత మహిళ నగర పోలమ్మ పెట్టిన అట్రాసిటీ కేసుపై శనివారం డిఎస్‌పి పి.శ్రీనివాసరావు దర్యాప్తు చేశారు. తహశీల్దార్ కార్యాలయానికి వెళ్తుండగా కార్యాలయానికి ఎదురుగా రోడ్డుపై తనను కులం పేరుతో దూషించినట్లు పోలమ్మ ఫిర్యాదు చేయడంతో నేర స్థలం వద్ద మహిళను విచారించారు. సమగ్ర దర్యాప్తు చేసి నేరం రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి చెప్పారు. ఆయనతో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ఉన్నారు. కాగా దళిత మహిళపై దురుసుగా వ్యవహరించిన విఆర్ఒను వెంటనే అరెస్టు చేయాలని పట్టణంలో స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం నాయకులు నిరసన తెలిపారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- తెర్లాం

స్థానిక భవిత కేంద్రంలో శనివారం బ్రెయిలీ జయంతి వేడుకలను ఎంఇఒ త్రినాధరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లూయి బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా లూయి బ్రెయిలీ అంధుల కోసం చేసిన సేవలను గూర్చి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య విభాగానికి చెందిన ఉపాధ్యాయులు పి.సునీల్ కుమార్, ఏ సూర్యారావులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక భవితకేంద్రంలో ఐఇఆర్‌సి రాజేశ్వరి, తేజస్వినిల ఆధ్వర్యంలో అంధుల అక్షర ప్రధాత లూయిస్ బ్రెయిలీ జయంతి శనివారం నిర్వహించారు. ఎంఇఒ తిరుమల ప్రసాద్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. వికలాంగ విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అందులు చదువుకొని అన్నిరంగాలలో రాణించటానికి బ్రెయిలీ కనుగొన్న లిపే కారణమని తెలిపారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం కామేశ్వరరావు ఆధ్వర్యంలో బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రామభద్రపురం: బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బొండపల్లి: మండలంలోని అంబటివలస ఎంపిపి పాఠశాలలో శనివారం ఎంఇఒ శోభారాణి ఆధ్వర్యంలో బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఒ- 2 అల్లు వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ.ఆనంద్, భవిత సెంటర్ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పూసపాటిరేగ: లూయి బ్రెయిలీ అంధుల పాలిట ఆరాధ్య దైవమని ఎంఇఒ -2 బి.పాపి నాయుడు అన్నారు. అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భవిత కేంద్రంలో శనివారం లూయి బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి దివ్యాంగ విద్యార్థుల చేత కేక్ కోయించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుని బి.నీలిమ, సహిత విద్య ఉపాధ్యాయులు ఎన్.బంగారునాయుడు, ఎం.వెంకటేశ్వరరావు పి.అప్పలరాజు సమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: బ్రెయిలీ జయంతిని భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త సూర్యారావు, సహ సమన్వయకర్త భారతి, సహ జిసిడిఒ గాయత్రి, ఎఎస్ఒ జగన్, ఎంఇఒ శ్రీరాము, ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఐఆర్‌పిలు రవీంద్ర, అప్పలరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు సింహ గర్జన

ప్రజాశక్తి - రాజాం

ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణకు వ్యతిరేకంగా జనవరి 6న విజయనగరంలో జరగనున్న మాల సింహగర్జనకు దళిత బహుజనులంతా భారీగా తరలిరావాలని సమత సైనిక్ దళ్ నాయకుడు గెడ్డపు నీలకంఠం (బుజ్జి) కోరారు. మండలంలోని వంజరాపేట (సారధి) గ్రామంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలంతా ఐక్యంగా పనిచేసి, వర్గీకరణను అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. దళిత బహుజనులకు కులగణన చేయకుండా ఉప కులాలుగా వర్గీకరించడం సరికాదని, ఐక్యతతో వర్గీకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. వర్గీకరణ పేరుతో రాజకీయంగా కుట్రచేసి దళిత బహుజనుల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బవిరి శ్రీను, బంటు రూప, గెడ్డపు తవుడు, గుణపు జయమ్మ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సృజనాత్మక విద్య

ప్రజాశక్తి-బొబ్బిలి

అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు సృజనాత్మక విద్యను అందిస్తున్నామని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 3, 4, 7, 9, 16, 18, 21, 22, 23 వార్డులలో శనివారం ఇసిసిఇ దినోత్సవం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో సృజనాత్మక విద్యను, ఆటలు, పాటలు నేర్పిస్తామని మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను పంపించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని వేంద్రాంలో శనివారం ఇసిసిఇ డే ఐసిడిఎస్ సూపర్వైజర్ జానకి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గంట్యాడ ఐసిడియస్ పిఒ డి. ఉమాభారతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు ఆటపాటల ద్వారా విద్యనూ అదించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలో వియ్యంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఎన్‌కెఆర్‌పురం, వేపాడ, బొద్దాం, వల్లంపూడి అంగన్వాడి కేంద్రాల్లో శనివారం ఇసిసిఇ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు మంగలక్ష్మీ రాజేశ్వరి, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

తెర్లాం: మండలంలోని కుసుమూరు అంగన్వాడీ కేంద్రంలో ఇసిసిఇ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాడంగి సిడిపిఒ కె.రాజ్యలక్ష్మి అంగన్వాడీలో పిల్లలను చేర్పించడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో వివరించారు. తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీకి పంపించేటట్లు ప్రోత్సహించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పెరుమాలి అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ హేమలత పాల్గొని పలు సూచనలు చేశారు.

పారిశుధ్యంపై రాజీ పడొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణ ప్రాంతంతో పాటు శివారు ప్రాంతాలు కూడా పారిశుధ్యపరంగా రాజీ పడొద్దని, పరిశుభ్ర వాతావరణం నెలకొనాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శనివారం కెఎల్‌పురం ప్రాంతంలో పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోతట్టు ప్రాంతం బురదమయంగా ఉండడాన్ని గమనించారు. తక్షణమే ఆ ప్రాంతమంతా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సిబ్బందికి ఆదేశించారు. శివారు కాలనీవాసులు సరైన రహదారులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారని, ఆయా ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు చొరవ చూపుతామని అన్నారు.

సిఎంఆర్ జంక్షన్‌లో గత కొన్నేళ్ళుగా వర్షపు నీరు, పైపులైను లీకులు,మట్టి, చెత్తాచెదారాలతో నిండి ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జికు ఎట్టకేలకు మోక్షం లభించినట్లు అయింది. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య, ఇంజనీరింగ్ సిబ్బంది అక్కడికి వెళ్లి యుద్ధ ప్రాతిపదికన ఆర్‌ఒబి వద్దనున్న చెత్త ప్రక్షాళన చర్యలను ముమ్మరంగా చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: కమిషనర్ రామలక్ష్మి శనివారం మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, సెక్రటరీలతో కలిసి శనివారం ఇందిరమ్మ కాలనీ, పోలవాని వలసలో పర్యటించారు. ఇందిరమ్మ కాలనీలో ఇటీవల తవ్వించిన కచ్చా కాలవలను పరిశీలించారు. ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తను ఏరివేయించాలని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ ఆదేశించారు. కాలనీ చివరి లైన్‌లో ఉన్న కాలువలకు అవుట్లెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలవానివలస శ్మశాన వాటిక వద్ద నిర్మాణ దశలో ఉన్న ప్రహరీ గోడను పరిశీలించి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌కి సూచనలు జారీ చేశారు.

ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు అన్నారు. మధ్యాహ్న భోజన పథక కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంఇఒ కూర్మారావుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారి శ్రమను దోచుకుంటున్నాయన్నారు. రోజురోజుకీ మార్కెట్లో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, దానికి తగ్గట్టుగా మెనూ ఛార్జీలు పెంచాలి కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెనూ ఛార్జీలేమో పైసల్లో ఇచ్చి వందలు వేల రూపాయిల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పెట్టమంటే అది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకానికి కావాలసిన వంట సరుకులు, వంట గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. డోక్క సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అక్షయపాత్రకు అప్పజెప్పడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు బి మంగ లక్ష్మి, కే సత్యవతి, జే కాసులమ్మ, జే రమణమ్మ,,ఈ మంగమ్మ, కే సింహాచలం, ఉల్లి వెంకటలక్ష్మి, జి పార్వతి, సిహెచ్ వెంకటలక్ష్మి, పి దేవి, బి సత్యవతి, డి సంజాసమ్మ, పి ఎల్లమ్మ, ఎం రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు వేలం

ప్రజాశక్తి- గజపతినగరం

ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు శనివారం అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ. శ్రీరంగదొర సమక్షంలో వేలం నిర్వహించారు. మార్కెట్ విలువ ఎక్కువగా ఉండటం వల్ల వేలం పాటలో ఎవరూ పాల్గొనలేదు. అనంతరం గత నవంబరులో పట్టుబడిన 38.7 లీటర్ల మద్యం, 3.75 లీటర్ల నాటు సారాని ధ్వంసం చేశారు. అనంతరం దావాలపేట, బోడసింగిపేటలలో గల మద్యం షాపులను తనిఖీ చేశారు. మద్యం అమ్మకాలలో అవకతవకలకు పాల్పడితే తీవ్ర చర్యలు తప్పవని షాపులలో సిబ్బందికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ జీ. జనార్ధనరావు, ఎస్ఐ పి. నరేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా రీసర్వే చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భోగాపురం

రైతులకు సంబంధించిన భూములను పక్కాగా రీ సర్వే చేయాలని ఆర్‌డిఒ దాట్ల కీర్తి అన్నారు. రీ సర్వేకి సంబంధించిన గ్రామసభను రావాడ గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా ప్రభుత్వ భూములు, గ్రామ సరిహద్దులు గుర్తించాలన్నారు. అనంతరం రైతుల భూములను సర్వే చేయాలని తెలిపారు. సర్వే జరిగేటప్పుడు రైతులకు తప్పనిసరిగా నోటీసులు ఇవ్వాలన్నారు. రీ సర్వేలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదని తెలిపారు. అంతకుముందు తహశీల్దార్ మామిడిపల్లి సురేష్ ఆధ్వర్యంలో గ్రామంలో రీ సర్వేకి సంబంధించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అపురభుక్త పైడినాయుడు, సర్వేయరు మధుకేశ్వర రావు, విఆర్ఒ కాళీ, గ్రామ పెద్దలు సూర్యనారాయణమూర్తిరాజు, అమనాపు శ్రీను, అపురభుక్త సూర్యనారాయణ, కొండపు రాధాకృష్ణ రెడ్డి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని ఎటి అగ్రహారం, ఆల్తిపాలెంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులను ఎస్‌సి సొసైటీ ఇడి సుధారాణి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదస్సులు సక్రమంగా నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి. సుదర్శన రావు, మండల సర్వేయర్ దివ్య, ఆర్ఎస్‌డిటి ఎం.సత్యనారాయణ, విఆర్ఒలు రవి, శ్రీను పాల్గొన్నారు.

భోగాపురం: రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కీర్తి

వేపాడ: మండలంలోని పెద్ద గుడిపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ముటేషన్ల కోసం రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, గ్రామ సచివాలయ సర్వేయర్ గ్రామ రెవెన్యూ అధికారి గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - భోగాపురం

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తామని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కె.వి శివారెడ్డి అన్నారు. శ్రీకాకుళం వెళ్తూ శనివారం భోగాపురంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. సమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాలతో తొలగించిన హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. పిఆర్సి కమిటీ నియామకం, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ అడ్వాన్సులు, కరువు భత్యం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయన్నారు. అనంతరం జిల్లా ఎపి ఎన్‌జిఒ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. భోగాపురంలో ఎన్‌జిఒ సంఘ భవనం నిర్మాణానికి సహకరించాలని తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు కోరగా రాష్ట్రం సంఘం తరపున కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, జిల్లా అధ్యక్షులు శ్రీధర్ బాబు, కార్యదర్శి సురేష్, యూనియన్ నాయకులు కిషోర్, సురేష్, శ్రీవిద్య, కెబి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాయకులకు వినతి పత్రాన్నిస్తున్న తొలగింపబడిన హెల్త్ అసిస్టెంట్లు

ఉపాధి హామీ సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశం

ప్రజాశక్తి - భోగాపురం

నియోజకవర్గ పరిధిలోని ఉపాధి హామీ సిబ్బందితో ఎమ్మెల్యే లోకం మాధవి శనివారం విస్తృత స్థాయి సమావేశం క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ పని కల్పించాలన్నారు. పనికి వస్తామన్న ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు అందజేయాలని కోరారు. కూలీలకు ప్రభుత్వ పథకాలపై వివరించాలని తెలిపారు. అవినీతి లేకుండా సక్రమంగా విధులు చేపట్టాలన్నారు. ప్రజలకు నమ్మకంగా కలిగేలా క్షేత్ర సహాయకులు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు లోకం ప్రసాద్, నాలుగు మండలాల ఎపిఒలు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రాజాం

పట్టణం ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని, ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యులను కోరారు. ఆసుపత్రి పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, ఇది ఆసుపత్రి కాదు ఒక దేవాలయం లాగా వచ్చే రోగులకు కనపడాలన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి కమిటీ సభ్యులు, డాక్టర్లు, హాస్పటల్ సిబ్బంది, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీ

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- బొబ్బిలి

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బేబినాయన కోటలో శనివారం పంపిణీ చేశారు. రామభద్రపురం మండలం, మిర్తివలస గ్రామానికి చెందిన చింతాడ కన్నంనాయుడుకు రూ.1,39,335, బాడంగి మండలం, కోటిపల్లి గ్రామానికి చెందిన డొకల వెంకటలక్ష్మికు రూ.45వేలు, తెర్లాం మండలం, వి.చిన్నయ్యపేటకు చెందిన దత్తి జయమ్మకు రూ.81,000, చప్ప అప్పలనరసమ్మకు రూ.30వేలు చెక్కులను అందజేశారు. పేదలకు సంజీవనిలా సీఎం సహాయ నిధి పని చేస్తుందని బేబినాయన అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.భాస్కరరావు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

స్థానిక సింగారపువీధిలో ఉన్న శ్రీవైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ముగ్గులు పోటీల విజేతలకు శనివారం ఎమ్మెల్యే బేబినాయన బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి సిహెచ్ మాధవి, ద్వితీయ బహుమతి పి.పద్మ, తృతీయ బహుమతి జి.తులసి, నాలుగో బహుమతి రమణమ్మ, ఐదో బహుమతి స్వాతి, పద్మజ కైవసం చేసుకున్నారు. వీరికి బేబినాయన బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

విద్యార్థులకు పరీక్షాపేపై చర్చ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పరీక్షా పే చర్చా కార్యక్రమం శనివారం జరిగింది. ప్రధాని మోడీ పరీక్షా పే చర్చా 2025 (పిపిసి) కోసం హెచ్ఎం సూచన మేరకు ఉపాధ్యాయులు, విద్యార్థులచే గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బంగారయ్య మాట్లాడుతూ పిపిసి రిజిస్ట్రేషన్ 2025 జనవరి 14 వరకు కొనసాగుతోందని, పరీక్షా పే చర్చా ఈవెంట్‌కు హాజరు కావడానికి ఇష్టపడే ఆసక్తి, అర్హత గల విద్యార్థులు పాల్గొనడానికి ఇన్నోవేట్ ఇండియా1 మై గవర్నమెంట్ ఇన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాల్గొనేవారు చివరి తేదీ కోసం వేచి ఉండవద్దని, వీలైనంత త్వరగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రితో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం రావడం ద్వారా పరీక్షల మీద ఉన్న భయాందోళనలు పోయి ఆత్మస్థైర్యం నెలకొంటుందన్నారు. కాగా పిల్లల ద్వారా తల్లిదండ్రులచే కూడా నమోదు కార్యక్రమం చేపడతామన్నారు.

మోపాడ పిహెచ్‌సి సందర్శన

డెంకాడ: మండలంలోని మోపాడ పిహెచ్‌సిని జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జీవనరాణి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో ఎన్‌సిడి, గర్భిణులు, టిబి 100 డేస్ కార్యక్రమం, ఆర్‌బిఎస్‌కె, యువిన్ అప్ లాగిన్ గురించి వివరించారు. ఎఎన్‌ఎంలు తప్పనిసరిగా యూనిఫామ్ వేసుకోవాలని ఆదేశించారు. ఎఇఎఫ్ఐ కిట్‌లో ఏమేమి ఉండాలి, వాక్సిన్ వేసుకునేందుకు ముందుకు వచ్చేలా ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌తో ఎరువుల పిచికారీ

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేట గ్రామంలో మొక్కజొన్న పంటలో శనివారం డ్రోన్ సహాయంతో ఎరువుల పిచికారి చేశారు. గ్రామానికి చెందిన దంతులూరి సురేష్ రాజు పొలంలో ద్రవ రూప ఎరువులను పిచికారి చేశారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

- 18 తులాల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని కాళీఘట్ కాలనీలో గతనెల 24న కొట్టక్కి జగన్మోహన్‌రావు ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 18తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి వకుల్ జిందాల్ వెల్లడించారు. వీధుల్లో బెలూన్లు అమ్ముతూ అనుమానస్పదంగాసంచరించే వ్యక్తుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కాళీఘట్ కాలనీలో కొట్టక్కి జగన్మోహనరావు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేయకుండా పక్కనే ఉన్న షాపునకు వెళ్లగా ఒక మహిళ వీధిలో బెలూన్లను విక్రయిస్తూ, తలుపు వేయకుండా ఉన్న ఆ ఇంట్లో ప్రవేశించి 18తులాల బంగారు వస్తువులను దొంగిలించుకొని పోయిందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితులు జార్ఖండ్ రాష్ట్రం టాటానగర్‌కు చెందిన నేహ సబర్ (21), ఆమె భర్త సరోజ్‌జానీ (26)ను అరెస్టు చేశారని తెలిపారు. వీరి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసును చేధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సిఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐలు వి.ఎల్. ప్రసన్న కుమార్, కానిస్టేబుళ్లను ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, సిఐలు ఎస్.శ్రీనివాస్, ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న రంగోత్సవ్ పోటీలు

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో రంగోత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. పగడాలమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 7న డైట్‌లో రంగోత్సవ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్విజ్‌లో ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల చరిత్ర, సంస్కృతి, భౌగోలిక అంశం, డ్రాయింగ్‌లో స్వతంత్ర సమరయోధుల చిత్రం గీయడం, తెలుగు, ఆంగ్లంలో చేతి రాత, ముగ్గుల పోటీలు 8 నుంచి ఇంటర్ విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ జానపద నృత్యం, డిజిటల్ కాలేజ్ యూనిటీ, ఇంటిగ్రేటెడ్ పోస్టర్, రోల్ ప్లే అంశాలపై పోటీలు జరుగుతాయని తెలిపారు. 6 నుంచి ఇంటర్ విద్యార్థులు పోటీల్లో పాల్గొనడానికి పి.రవికుమార్ ఫోన్ నెంబర్ 7989350244, కె. సూర్యారావు 8919985388 సంప్రదించాలని కోరారు.

మతసామరస్యాన్ని కాపాడాలి

బొబ్బిలి: మత సామరస్యాన్ని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర రావు కోరారు. పట్టణంలో శనివారం మత సామరస్యాన్ని కాపాడాలని కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యాన్ని దెబ్బ తీసేలా బిజెపి, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ విజయవాడలో హైందవ సభ నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి లబ్ది పొందేందుకు బిజెపి కుట్ర పన్నుతుందని, ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోపాలం, ప్రజలు పాల్గొన్నారు.